క్లుప్తంగా

పీఎం కిసాన్‌కు ఎన్‌పీసీఐ తప్పనిసరి

సైదాపురం: ప్రధాన మంత్రి కిసాన్ పథకం సొమ్ము అందేందుకు బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ తప్పనిసరి అని వ్యవసాయాశాఖ అధికారి హైమావతి తెలిపారు. మండలంలోని రామసాగరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఎడగారు వరి పంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతులు బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ చేయించుకుంటేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము జమ అవుతుందన్నారు.

ఎన్నికల ప్రక్రియలో నైపుణ్యాలు పెంచుకోవాలి

సైదాపురం: ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ అధికారులు నైపుణ్యాలు పెంచుకోవాలని ఏఎస్‌ఓ శ్రీనివాసులు కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఓటరు జాబితా మార్పులు, చేర్పులు, ఎన్నికల ప్రక్రియపై బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో ముఖ్యపాత్ర నిర్వహించే బూత్‌లెవల్ అధికారులు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

చిట్టమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ కాయల సతీష్ కుమార్ బూత్ లెవల్ అధికారులకు ఓటరు జాబితాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తమ పరిధిలో ఉన్న పోలింగ్ బూత్ ఉన్న అర్హులైన వారిని గుర్తించి, అనర్హులను జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఉదయ్ కుమార్, డీటీ నరేష్ కుమార్, రీ సర్వే డీటీ నిరంజన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి

కోట: పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డీఎల్‌డీఓ వాణీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, నీటి సరఫరా, స్వర్ణ పంచాయతీ పురోగతి, సచివాలయాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంక్‌లు క్లోరినేషన్ చేపట్టాలని, మురుగునీటి కాలువలు శుభ్రం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ వేణు పాల్గొన్నారు.

కార్మికుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో కార్మికులు, నాయకులు

నాయుడుపేటటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఇంజినీరింగ్ విభాగ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజు సిబ్బంది కార్యాలయం ముందు బైఠాయించి నిరసనలు చేపట్టారు. సాయంత్రం ప్రభుత్వ తీరుపై నిరసిస్తు పట్టణంలో ప్రదాన వీధులలో బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుందా, ఇంజినీరింగ్ విభాగ కార్మిక సంఘ నాయకులు నాగరాజు, శీనయ్య, కాలేషా పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా



తుమ్మూరులో సరఫరా అయిన నీరు

నాయుడుపేటటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరులో కొళాయిలో వచ్చే నీరు తరచు కలుషితమవుతోంది. ఈ విషయమై పలు మార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్యాస్ పైప్‌లైన్ కోసం చేసిన తవ్వకాలతో పలు చోట్ల తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయి ఉన్నట్లు తెలిపారు. తాగునీరు కలుషితమై వస్తున్నట్లు అందిన ఫిర్యాదులపై పరిశీలించిన అవసరమైన చర్యలు చేపడతామని కమిషనర్ షేక్ ఫజులుల్లా వివరించారు.

నిబద్ధతతో ఓటరు జాబితా

పెళ్లకూరు: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ఉన్న బీఎల్‌వోలు ఓటరు జాబితాను నిబద్ధతతో రూపొందించాలని తహసీల్దార్ హరికృష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

చికెన్ ధరలు		16.07.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	116
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	234
లేయర్ చికెన్	:	190

సూళ్లూరుపేట : ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, నాయుడుపేటలో...





వెంకటగిరిలో..



గూడూరులో..



మీడియేషన్ ఫర్ ద నేషన్ ర్యాలీ

సూళ్లూరుపేట/నాయుడుపేటటౌన్/వెంకటగిరి రూరల్/గూడూరురూరల్ /పెళ్లకూరు: మీడియేషన్ ఫర్ ద నేషన్ పేరుతో 90 రోజుల్లో పెండింగ్ కేసుల పరిష్కారం కోసం న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు కలిసి బుధవారం పురవీధుల్లో ర్యాలీలు చేసి, ప్రజలకు అవగాహన కల్పించారు. సూళ్లూరుపేటలో అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సంయుక్త, నాయుడుపేటలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మీనాక్షి సుందరి, వెంకటగిరి లో జూనియర్ సివిల్‌జడ్జి న్యాయమూర్తి విష్ణువర్మ, గూడూరులో ఏడో అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సులో నాయుడుపేట సివిల్‌కోర్టు జడ్జి మీనాక్షి సుందరి మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): ఎన్నికల సమయంలో నెరవేర్చలేని హామీలను ప్రకటించిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మోసం చేసిన తీరును ఇంటింటికీ వివరిద్దామని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో బుధవారం వెంకటగిరి పట్టణ, రూరల్ నేతలతో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పంపిణీ చేసిన బాండ్లలో ఉన్న హామీలను ప్రజలను వివరించాలన్నారు. ప్రజలకు బాబు చేస్తున్న మోసాలను గ్రామ స్థాయి నుంచి ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు త్వరలో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి మండల కన్వీనర్లు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు సైదాపురానికి నేదురుమల్లి

సైదాపురం: మండలంలోని చాగణం గ్రామానికి గురువారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రానున్నట్లు మండల పార్టీ కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్ తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరు రూరల్ ప్రాంతంలోని సాయి నగర్‌లో ఉన్న సీఆర్‌రెడ్డి కళ్యాణ మండపంలో బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలసి వేదికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాపూరు: మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొడ్డు మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సంక్రాంతిపల్లి సమీపంలోని పాపకన్ను మధుసూదన్ రెడ్డి గార్డెన్‌లో సమావేశం ఉంటుందని, దీనికి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ పాపకన్ను మధుసూధన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

దొరవారిసత్రం: తల్లిదండ్రుల బిడ్డలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలియజేశారు. కల్లూరు గ్రామంలో చట్టాలు, ప్రమాదాలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్ వంటి వాటిపై బుధవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు సంపాదనకే పరిమితం కాకుండా పిల్లల నడవడికపై నిఘా ఉంచాలన్నారు. దీంతో పాటు కొంత సమయం పిల్లల కోసం కేటాయించి ఎప్పటికప్పుడు మాట్లాడితే వారి బాధలు, సమస్యలు తెలుసుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సంఘమేశ్వరరావు, ఎస్‌ఐ అజయ్‌కుమార్, నాయకులు రత్నయ్య, మల్లేయ్య, ప్రసాద్‌నాయుడు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

పదోన్నతులు కల్పించాలి

గూడూరురూరల్ : ఎనర్జీ అసిస్టెంట్ జేఎల్‌ఎంలకు నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేసి ఏపీఎస్‌ఈబీ రూల్స్ ప్రకారం ఏఎల్‌ఎంగా పదోన్నతులు కల్పించాలని డివిజన్ నాయకులు మదిర బాలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గూడూరు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేంద్రరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 21న ర్యాలీ, మహా ధర్నా నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

బంగారు కుటుంబాల ఎంపిక

చిల్లకూరు : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిలో భాగంగా పీ–4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాలను ఎంపిక చేసేందుకు సమాయత్తం కావాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మండలంలోని కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలని అన్నారు.

చెన్నైకి ఆర్టీసీ సర్వీసు

చిట్టమూరు: కోట ఆర్టీసీ బస్టాండ్ నుంచి చెన్నైకు ఆర్టీసీ బస్సు సర్వీసును గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ బుధవారం ప్రారంభించారు. చిట్టమూరు శివాలయం వద్ద జెండా ఊపి ఎమ్మెల్యే బస్సును ప్రారంభించారు. కోట నుంచి మల్లాం మీదుగా కొత్తగుంట, పూలతోట వైపుగా చెన్నైకు బస్సు నడుస్తుందని వాకాడు డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు.

ఉద్యాన పంటలకు ఎంపిక

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు చేసేందుకు ముందుకు వచ్చే సన్న, చిన్న కారు రైతులను గుర్తించాలని ఏపీఓ గిరి సూచించారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో నిర్ణయించిన లక్ష్యం 35 ఎకరాలు కాగా అందులో ఇప్పటికే 18 ఎకరాల్లో నిమ్మ సాగు చేసేలా రైతులను గుర్తించినట్లు తెలిపారు. లక్ష్యం పూర్తిగా సాధించేందుకు మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ పంటలను సాగు చేసే రైతులను గుర్తించాలని తెలిపారు.

అబద్ధాల బాబు.. బూటకపు హామీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: ప్రతి ఎన్నికల్లోనూ నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పడం, బూటకపు హామీలు ఇవ్వడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. స్థానిక పున్నమి అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కే ఆర్ముగం అధ్యక్షతన బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కిలివేటి మాట్లాడుతూ, 2014, 2024 ఎన్నికల్లోనూ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని లేదంటే నిరుద్యోగ భృతి 3వేలు ఇస్తానని మొండి చెయ్యి చూపాడని గుర్తుచేశారు. ఏడాదికి 4లక్షల చొప్పున ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న పెద్ద మనిషి ఇప్పటి వరకు నాలుగు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలంలో వచ్చిన పరిశ్రమలను చంద్రబాబు రిబ్బన్ కట్ చేసి, తానే తెచ్చానని గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బీ జయకుమార్‌రెడ్డి, నాయకులు ఆర్‌కే సుందర్‌రెడ్డి, వాసు మొదలియార్, రాజ్‌కుమార్, రమేష్, మునీష్‌రెడ్డి, తిరుమలైరెడ్డి, శశికుమార్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఎంఏవై గృహాలను తనిఖీ చేసిన పీడీ

దొరవారిసత్రం : శ్రీధనమల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 2021–22లో పీఎంఏవై పథకం కింద మంజూరైన వివిధ దశల్లో ఉన్న 20 పక్కా గృహాలను బుధవారం తిరుపతి జిల్లా హౌసింగ్ పీడీ దయాకర్ స్థానిక హౌసింగ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఐదు గృహాలు పూర్తికాగా మిగిలిన 15 గృహాలు వివిధ దశాల్లో ఉన్నాయి. వీటిని ఆయన సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని ఆయన కోరారు. ఎప్పటికప్పుడు బిల్లు పెట్టాల్సిందిగా పీడీ హౌసింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసరావు, ఏఈ మోహన్ రావు ఉన్నారు.



శ్రీధనమల్లి గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతూ పీడీ దయాకర్

సమయపాలన లేని సచివాలయ సిబ్బంది

చిట్టమూరు : కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సచివాలయ సేవలు ప్రజలు క్రమంగా దూరమవుతున్నాయి. మండలంలోని కోగిలి గ్రామ సచివాలయానికి బుధవారం ఉదయం 11.30 గంటలకు కూడా కార్యాలయ తలుపులు తీయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పని మీద అక్కడికి వచ్చిన ప్రజలు సచివాలయానికి సెలవు ప్రకటించారేమోనని తిరిగి వెళ్లిపోయారు. కొందరు మాత్రం ఎంపీడీఓకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ మనోహర్ గౌడ్‌ను వివరణ కోరగా డిజిటల్ అసిస్టెంట్ తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశానికి వెళ్లారని, పంచాయతీ కార్యదర్శి మరో పంచాయతీకి వెళ్లినట్లు చెప్పడం గమనార్హం.



బుధవారం మూత వేసి ఉన్న కోగిలి సచివాలయం

కండలేరులో 29.707టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 29.707టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1720, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 90, మొదటి బ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

బీఎల్‌ఓలు హాజరు కావాలి

చిల్లకూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు, తొలగింపుల ప్రకియలపై గురువారం నిర్వహించే అవగాహన కార్యక్రమానికి బీఎల్‌ఓలు తప్పక హాజరు కావాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. ఆయన బుధవారం రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతూ చిల్లకూరులోని సంఘమిత్ర కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జ్యోత్స్నకు అభినందనలు

గూడూరురూరల్ : మండలంలోని విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వెంకట జ్యోత్స్న ట్రిపుల్ ఐటీకి ఎంపికవడంతో బుధవారం పాఠశాలలో సన్మానించారు. పదో తరగతిలో 570 మార్కులతో ట్రిపుల్ ఐటీ సీటు సాధించింది. హెచ్.ఎం.డివిఎస్ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు జ్యోత్స్న ప్రతిభను ప్రోత్సహిస్తూ రూ.5,516 నగదు బహుమతిని అందజేశారు.

సొంతింటి కల సాకారమయ్యేనా?







బోర్‌వెల్ ఏర్పాటు చేసిన దృశ్యం, జగనన్నకాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసిన దృశ్యం

- ముందుకు సాగని పక్కాగృహాల నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో ఆగిపోయిన పనులు

సైదాపురం: ప్రతి పేదవాడికి సొంతింటి కలను సాకారం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ చేసి నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వం నిర్మాణ పనులను పరుగులెత్తించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయో లేదో అని లబ్ధిదారుల్లో సందేహం కలుగుతోంది.

ముందుకు సాగని పనులు

మండలంలో జగనన్న కాలనీలోని 36 లేఅవుట్లలో 711 ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. థర్డ్ పార్టీ ద్వారా ఇళ్ల నిర్మాణాలను చేపట్టగా, అందులో ఇప్పటి వరకు 21 ఇళ్లకు రూఫ్ వేయగా, 48 రూఫ్ లెవల్లో, 7 ఇళ్లు కిటికీల స్థాయి వరకు, 163 బేస్ లెవల్లో ఉండగా, నిర్మాణం పూర్తి చేసి ఇంటికి పూతలు వేసినవి 3 మాత్రమే ఉన్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో 862 మందికి జగనన్న ఇళ్ల మంజూరు కాగా 111 ఇళ్లు మాత్రం పూర్తయ్యాయి. బేస్ లెవల్‌లో 162, లెంటల్ లెవల్లో 8, పై కప్పు పూర్తి అయినవి 42కాగా పై కప్పు స్థాయిలో 48 ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రగతిని లక్ష్యంగా చేసుకుని టాప్‌లెవల్ పూర్తయిన ఇళ్లను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలు నిలిపివేశారు.

గత ప్రభుత్వంలో సకల వసతులు

పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాగునీరు, విద్యుత్ వంటి అన్ని సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టింది. కాలనీలో పార్కు, దేవాలయం, బడి వంటివి ఏర్పాటుకు స్థలాలను కూడా కేటాయించింది. కాలనీలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి ఇళ్లను లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో పనులు చేపట్టింది.కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. వీధి వీధికి ఒక మినీ 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారడంతో జగనన్న కాలనీల్లో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి.

త్వరలో పనులు చేపడతాం

ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా త్వరగా చేపడతాం. మిగిలిన ఇళ్లను మార్చి లోపల పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్ ద్వారా నిలిచిపోయిన పనులు కూడా పూర్తి చేయిస్తాం. కొత్తగా 895 ఇళ్లకు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేశాం. అవి కూడా త్వరలోనే మంజూరు కావచ్చు.

–జి శ్రీనివాసులు, హౌసింగ్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఏఈ

నేలబావిలో పడ్డ ఆవు

కోట: నేలబావిలో పడ్డ ఆవును ఫైర్‌సిబ్బంది చాకచక్యంగా రక్షించారు. మండలంలోని విద్యానగర్ మారుతీనగర్‌లో బుధవారం రైతు చంద్రమోహన్‌కు చెందిన ఆవు సమీపంలో ఉన్న 30 అడుగుల నేలబావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. స్థానికులు గుర్తించి వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్రేన్‌సాయంతో తాళ్లు కట్టుకుని బావిలోకి దిగి ఆవును సురక్షితంగా బయటకు తీశారు.



బావిలో పడ్డ ఆవును రక్షిస్తున్న ఫైర్ సిబ్బంది

ఐదో రోజు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

చిల్లకూరు: డిమాండ్‌ల పరిష్కారం కోసం సమ్మె బాట పడితే తమపై అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల నాయకులు వాపోయారు. గూడూరు మున్సిపాలిటీలో పని చేసే ఇంజనీరింగ్ వర్కర్ల సమ్మెలో ఐదో రోజు బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి టవర్ క్లాక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వీరికి పారిశుధ్య కార్మికులు సంఘీభావం తెలిపారు. నాయకులు దారా కోటేశ్వరరావు, వెంకటరమణ, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, అడపాల ప్రసాద్, మణి, మురళి, చంద్రయ్య పాల్గొన్నారు.



గూడూరు: నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బద్రి



పీర్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శివప్రసాద్, అధ్యాపకులు

గూడూరురూరల్ : పట్టణంలోని ఎస్.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ బద్రి పీర్‌కుమార్ తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్వచ్ఛంద సంస్థ అయిన తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పద్మశ్రీ ఎన్.టి.రామారావు, భారత రత్న పి.వి.నరసింహారావు జయంతి ఉత్సవాలు–2025 పురస్కరించుకుని బద్రి పీర్ కుమార్ ఎన్.టి.ఆర్. జాతీయ అవార్డును అందుకున్నారని చెప్పారు.